


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఏమీ చెయ్యనివాడు

**ఒకాయన మా మధుమాసం** సినిమా సిట్టింగ్స్‌కి వచ్చేవాడు. పొద్దుటే వచ్చేవాడు రామానాయుడిగారి స్టూడియోకి. మేం గెస్ట్‌హౌస్‌లో కాకుండా, నాయుడిగారి ఆఫీస్ మీద రూంలో కూర్చునే వాళ్ళం సిట్టింగ్స్‌కి. సత్యానంద్‌గారు సంభాషణల రచయిత, నేను కథా రచయిత్రిని, చంద్ర సిద్దార్థ డైరెక్టర్..అందరం వచ్చేసినా 'అతని' కోసం వెయిట్ చెయ్యడం అలవాటు అయింది. అతను వస్తూనే మాతోబాటు కాఫీ తాగేవాడు. మధ్యాహ్నం లంచ్ చేసేవాడు, మూడు గంటలకి మళ్ళీ టీ తాగేవాడు. సిట్టీంగ్ లేట్ అయితే సాయంత్రాలు మాతోపాటు మిర్చిబజ్జీలో సమోసాలో తినేవాడు. పొద్దుట నుండీ సాయంత్రం దాకా జరిగే కథా చర్చల్లో మాత్రం నోరు తెరిచి మాట్లాడేవాడు కాదు.

అతను అలా రోజూ రావడానికి అతని వెనకాల అతని తమ్ముడు అయిన ఓ రావుగారుండేవారు (ఇప్పుడు పేరు మోసిన పొలిటీషియన్, అప్పట్లో కాదు) ఇతని పేరు ఏదైతేనేం కానీ ' తమ్ముడు రావు'గారు అందాం.

మొదటి రోజు నేను ఆయన్ని "మీరేం చేస్తారు?" అని అడిగాను.

"ఊరికే కూర్చుంటాను" అన్నాడు.

"అది కాదు, ప్రొఫెషన్? పనేం చేస్తారు" అన్నాను.

"ఏ పనీ చెయ్యనండీ" అన్నాడు.

అందరం మొహామొహాలు చూసుకుని నవ్వేసి "ఏ పనీ చెయ్యకుండా ఎలాగండీ?" అన్నాం.

"నిజం! నేను పుట్టింది మొదలు జరుగుబాటు కోసం ఏ పనీ చెయ్యలేదు" అన్నాడు.

"పోనీ మీ నాన్నగారేం చేసేవారూ?"అడిగాను.

"చాలా చేసారు. పోయేటప్పుడు మా అన్నదమ్ములిద్దరికీ చెరి రెండు కోట్లూ ఇచ్చి పోయారు" అన్నాడు.

"అందుకని మీరు ఏ పనీ చెయ్యట్లేదా?" అడిగాను.

"ఔను! ఆ ఇంట్రెస్ట్‌తో బతుకుతాం, నాకు ఓ భార్యా, ఇద్దరు పిల్లలూ" అన్నాడు.

"అసలు ఏ పనీ చెయ్యాలనిపించలేదా?" అని ఇంకొకరు అడిగారు.

"మా తమ్ముడు నాన్న ఇచ్చిన డబ్బుతో చాలా వ్యాపారాలు చేసాడండి. దానివల్ల వాడు ఇంకా పని చెయ్యాల్సొచ్చింది" అన్నాడు.

"నష్టాలొచ్చా?"

"కాదండీ.. లాభాలు రావడం, మళ్ళీ అవన్నీ ఇన్‌వెస్ట్ చేసి కొత్త వ్యాపారం మొదలు పెట్టడం, సంపాదించిన దానిమీద టాక్సులు ఎలా తప్పించుకోవాలో ఆలోచించడం, మళ్ళీ కొత్తవాటివల్ల లాభాలొస్తే, ఆ డబ్బు ఇంకో దానిలో పెట్టడం.. దాంతో ఆలోచించి ఆలోచించి వాడి బుర్ర మీద వెంట్రుకలన్నీ రాలిపోయాయి. మనశ్శాంతిగా నాలా ఇలా తీరుబడిగా కూర్చోలేడు.. ప్రతి నిమిషం ఏం చెయ్యాలో పి.ఏ చెప్తూ వుంటుంది. డైనింగ్ టేబుల్ దగ్గర కూడా చెవిలో ఫోన్స్, ఇష్టమైన ఫుడ్ తినడానికి టైం లేకుండా తిన్నాక హాయిగా మధ్యాహ్నాలు గుండెలమీద చేతులేసుకు పడుకోడానికి లేకుండా అబ్బబ్బా.. చిరాకేసింది అండీ. పక్కవాడికి బెంజ్ వుంది. అంటే అంతకన్నా పెద్దది కొనాలనీ, వాడికి ఏడుకోట్లు ఇల్లుంటే, పధ్నాలుగు కోట్లు పెట్టి కట్టాలనీ.. ఇదే ధ్యాస. మనశ్శాంతి లేకుండా" అన్నాడు.

"మరి మీ ఆవిడ ఎప్పుడూ అడగలేదా? ఏదైనా పని చెయ్యమని? పెళ్ళప్పుడు అత్తమామలు కానీ?" అని మళ్ళీ ఒకరు అడిగారు.

"నేను కరాఖండీగా చెప్పేసాను. నేను ఏ పనీ చెయ్యను. ఇష్టమైతేనే పెళ్ళిచేసుకోమని.. " అని నవ్వి.

"పిల్లలు పెద్దవుతున్నప్పుడు వాళ్ళ స్నేహితులకి మా నాన్న రియల్ ఎస్టేట్స్ వ్యాపారం చేస్తాడు" అని చెప్పేవారు. ఓ రోజు ఓ అబ్బాయి "అంకుల్ మీరెక్కడ రియల్ ఎస్టేట్స్ బిజినెస్ చేస్తున్నారూ" అని అడిగితే చెప్పేసాను "మా పిల్లలు అబద్ధాలు చెప్తున్నారు. నేనే పనీ చెయ్యను" అని.

మా అబ్బాయి చాలా గొడవ చేసాడు. అందరి ముందూ చిన్నతనంగా వుందని. మా ఆవిడ "ఏదో ఒకటి చెప్పనివ్వండి" అంది.

"నువ్వేం చెప్తున్నావ్ నీ ఫ్రెండ్స్‌తో?" అడిగాను.

"కథలు ఆలోచిస్తుంటారు సినిమా తియ్యడానికి అని చెప్పాను" అంది.

"ఆలోచించడం వరకూ.. నిజమే! కాబట్టి ఊరుకున్నాను" అన్నాడు.

అతనికి సినిమా రంగం పట్ల అపారమైన జ్ఞానం వుంది. కథలు రాయడంలాంటి క్రియేటివ్ వర్క్ కాదు కానీ "ఎవరు ఏ తార ఇంటికి అర్ధరాత్రులు రహస్యంగా వెళ్ళేవారూ?"

"ఎవరెవరికి భార్యలకి తెలీకుండా చిన్న ఇళ్ళు వున్నాయి? ఎవరి భార్యలు పరమ పతివ్రతల టైప్‌లో భర్త గర్ల్ ఫ్రెండ్స్‌కి ఇంటికొస్తే, భోజనం పెట్టి, చీరపెట్టి పంపిస్తారూ? సవతుల పిల్లల్ని ప్రేమించే సాధ్వీ మణులు ఎవరూ? ఎవరెక్కువ బూతులు మాట్లాడగలరూ? దొంగ డబ్బు ఎక్కడ దాస్తారూ? ఎవరి ఆస్తికి ఎవరు బినామీలూ? ఇవి సినిమా ఇండస్ట్రీలో పెద్దల గురించి ఇతనికి క్షుణ్ణంగా తెలిసినట్లు మాట్లాడే వాడు.

కొంతమందికి మాట్లాడడం సరదా! ఆ కోవలోకి వస్తాడు ఇతడు. కథ చర్చిస్తుంటే మౌనంగా వుండేవాడు. మధ్యలో కొచ్చి డిస్టర్బ్ చేసేవాడు కాదు. పకోడీలు నమిలేటప్పుడూ, నాయుడుగారు సరదాగా మా సిట్టింగ్‌కి వచ్చినప్పుడూ ఈ వినోదాలన్నీ ఏకరువు పెట్టేవాడు.

నాయుడుగారికి ప్రతిరోజూ మేం ఎంత పని చేసామో కావాలి. నాతో "ఇవాళేమైనా కథ ముందుకి కదిలిందా? ఎన్ని సీనులొచ్చాయి?" అనేవారు. ఇతని వల్ల మా సమయం వృధా అయిపోతోందేమోనని ఆయనకి కాస్త బెంగగానే వుండేది. కానీ ఇతని తమ్ముడితో ఆబ్లిగేషన్స్ వల్ల అతని పరపతి వల్ల ఇతన్ని భరించేవారు. షూటింగ్స్‌కి ఇతని తమ్ముడి ఆఫీసు బిల్డింగ్స్ వాడేవారు. అతను ఈయనకి స్నేహితుడు.

అసలు నాయుడుగారు సమయానికి ఇచ్చే విలువ ఎలా వుండేదంటే? నేను ఇంట్లో స్టార్ట్ అయినప్పుడు డ్రైవర్‌ని ఫోన్ చెయ్యమనే వారు (మొదట్లో కంపెనీ కార్‌లో రామానాయుడి స్టూడియోకి వెళ్ళేదాన్ని) సరిగ్గా సగం దూరం వచ్చాక కాల్ చేసి, "ఎంతదాకా వచ్చారు కవిగారు?" అనేవారు. మళ్ళీ ఏ ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గరో ఆగిపోతే కారు, వాచ్ చూసుకుని "నిన్న ఈ టైం కల్లా వచ్చేసావు కదా.. మధ్యలో ఎక్కడా ఆగలేదు కదా?" అనేవారు.

మేం ఆయన స్కూల్‌ని "నాయుడిగారి బోర్డింగ్ స్కూల్" అనే వాళ్ళం. టైం విషయంలో ఒక మాట చెప్తుండేవారు.

"నా ఇంట్లోంచి లక్షరూపాయలు దొంగతనం చేసి దొరికిపోయినా క్షమించి వదిలేస్తానేమోగానీ నా సమయం పది నిమిషాలు వేస్ట్ చేసినా క్షమించను" అని.

సీనియర్ డైరెక్టర్, రైటర్స్ దగ్గరనుండీ ఆయన సమయ పాలన తెలిసి జాగ్రత్తగా వుండేవాళ్ళు.

రావుగారు మాత్రం ఆయన ఉడుక్కునేలాంటి ప్రైవేట్ జోక్స్, ఆయన పాత గర్ల్ ఫ్రెండ్స్ మీద పెళ్ళున పేల్చేసి, ఫెటేల్మని నవ్వుతుండేవాడు.

మా పరిస్థితి వర్ణనాతీతం. నవ్వాలా.. నవ్వకూడదా? అని.

"నవ్వండి.. అతను చెప్పేవి నమ్మకండి" అనేవారు నాయుడుగారు.

చాలా సందర్భాల్లో ఓకే కానీ కొన్ని సందర్భాల్లో నేను అతని జోక్స్ భరించలేక, బూతులు మాట్లాడినప్పుడు, హెచ్చరించాను. "మీరు అభ్యంతరకరంగా మాట్లాడ్తున్నారు" అని. అప్పటికి పూరుకున్నా మళ్ళీ అతని సహజ వాక్ ప్రవాహాన్ని ఆపలేకపోయేవాడు.

ఒకరోజు నాయుడుగారితో చెప్పేసాను. "ఇతను పనికి అడ్డం పడట్లేదుకానీ, అనకూడనివి.. ముఖ్యంగా మీ గురించి మాట్లాడ్తున్నాడు" అని.

ఆయన బాగా ఆలోచించి "అయితే మీరు అందరూ మద్రాస్‌లో మా వళ్ళార్ కొట్టం ఇంట్లో సిట్టింగ్స్ చెయ్యండి. పొణ్ణుస్వామీ, సంతానంలకి ఫోన్ చేసి ఏర్పాట్లు చేయిస్తాను" అన్నారు.

అతను "పొద్దుటే లేచి కాఫీ తాగి, పేపర్ చూసి, పలహారం చేసి బయటకొచ్చి కాలక్షేపం చేసి, మళ్ళీ భోజనం చేసి, సాయంత్రం కాఫీ తాగి, అటూ ఇటూ తిరిగి ఓ సినిమా చూసి, కొందరితో గప్పాలు కొట్టి, రాత్రి మళ్ళీ ఈటీవీ వార్తలు చూసి, భోజనం చేసి, టీవిలో ఓ సినిమా చూసి నిద్రపోతా" అని చెపితే నాకెంతో ఆశ్చర్యంగా వుండేది.

అతని భార్యకి పాపం వంటపనీ, పిల్లల బాగోగులు చూసుకోడంతో సరిపోయేది అనుకుంట. గృహిణికి రోజూ సరుకులూ, ఇంట్లో పనివాళ్ళూ, పిల్లల చదువులూ, ఫంక్షన్లూ, రోగాలూ, డాక్టర్లూ.. ఇలా అనేక పనులుంటాయి కదా! అవేమీ అతను పంచుకునేవాడు కాడుట. "నాకు మీలాగా లీటర్ పాలు ఎంత ఖరీదు వుంటాయి?కిలో టమాటాలు ఎంత వుంటాయి లాంటివి తెలీవు" అని చెప్పాడు.

కానీ ఏ హీరో విగ్ ఎక్కడ చేయిస్తాడూ? ఏ హీరొయిన్ అంగసౌష్టవానికి ఏం ప్లాస్టిక్ సర్జరీలు ఎక్కడ చేయించిందీ?ఎవరి వీక్‌నెస్‌లు ఏవిటీ? ఎవరికి ఇష్టమైన ఆహారం ఏవిటీ? మేకప్ మెన్‌లు హీరోల మొహాల గురించి చెప్పే రహస్యాలూ ఇవన్నీ అతను ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ సినిమా ఇండస్ట్రీలా చెప్తాడు. అంతేకాదు. ఏ సినిమాకి ఎంత వసూళ్ళు వచ్చాయీ? ఫస్ట్‌వీక్ ఏ హీరో సినిమాకి ఎంత వస్తుందీ? ఏది బాక్స్ ఆఫీస్ దగ్గర బొక్క బోర్లా పడిందీ? అందుకు కారణాలూ ఇవన్నీ కరతలామలకం.

ఇంత జ్ఞానాన్నీ అతను ఎన్నడు ప్రొడక్టివ్‌గా వాడిన దాఖలాలు లేవు. కూర్చుని ఓ పుస్తకంగా రాసినా నలుగురికీ ఉపయోగపడేదేమో! కానీ రాయడం అన్నది మళ్ళీ పనిలోకి వస్తుంది. పోనీ కూర్చుని చెప్తే? అప్పుడు ఇంతలా యూ ట్యూబ్ ఛానెళ్ళు లేవు. జర్నలిస్ట్‌లకి పిలిచి భోజనాలు పెట్టి, వెండిగ్లాసో, పళ్ళెమో చదివించి, జేబులో కవర్లలో డబ్బులు పెట్టి పెడితే తప్ప సినిమా గురించి  కవరేజ్ ఇచ్చేవారు కారు. అందరూ జర్నలిస్ట్‌లతో బాగా వుండే రోజులవి. అంతేకాదు  సినీతారల విషయాలూ, షూటింగ్‌ల ముచ్చట్లూ ఇలా సోషల్ మీడియాలో గడపగడపకీ చక్కర్లు కొట్టే రోజులు కావు. ఇవన్నీ తెలియాలంటే డబ్బులు పెట్టి సినిమా పత్రికలు కొనుక్కోవాలి అదొక్కటే మార్గం.

అలాంటి రోజుల్లో ఇలాంటి రావుగార్లు ఎక్కడికెళ్ళినా పెద్ద పీట వేసేవారు. ఇతనివల్ల సినిమాకి ఏం లాభం లేకపోయినా, ఖర్చూ, కష్టం లేకుండా మిగతా కాంపౌండ్లలో ఏం జరుగుతోందో తెలిసేది.

ఈవీవీ సత్యనారాయణగారుండేటప్పుడు ఆయన సిట్టింగ్‌లు వేరొక విధంగా జరిగేవి. అవి భువన విజయంలా వుండేవి. దగ్గర దగ్గర పది పన్నెండుమంది రచయితలని సర్వీస్ బస్‌లా ఓ రెండు టాక్సీలు ప్రతి స్టాప్‌లో ఎక్కించుకుని

ఆయన ఆఫీస్‌కి తీసుకెళ్ళేవి. ప్రతి రచయిత తాలుకు కాంట్రిబ్యూషనూ ఆయన నోట్ చేసుకునేవారు. నెలసరి జీతాలు ఇచ్చేవారు. అందరిపేర్లూ టైటిల్స్‌లో వేసేవారు. అందులో ఒకరిద్దరు కేవలం సినిమాకి పనికి వచ్చేవి కాకుండా పుకార్లు చెప్పేందుకు మాత్రమే వచ్చేవారు.. అదొక సందడి.

ఏ పనీ చెయ్యని ఈ వ్యక్తి తర్వాత ఏం చేసాడో నేను ఎప్పుడూ తెలుసుకోలేదు. నాకు తెలిసీ అతను ఏమీ చెయ్యడు.

అతని జీవిత ధ్యేయం అది.

మంచిదేగా.. ఏదో ఒకటి చేసి  ఇంకోడిని ముంచేకన్నా జరిగినప్పుడు ఏమీ చెయ్యకపోవడం.

Post your comments







